రెండో దశ రీ సర్వే పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకానికి సంబంధించి రెండో దశ రీ సర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి శుక్రవారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష రీ సర్వే, జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద చేపట్టిన లేఅవుట్, గృహనిర్మాణంలో పురోగతి పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబంధించి స్వచ్ఛ సంకల్పం, స్వామిత్వబీ స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించి యువతకు శిక్షణ కార్యక్రమాలు గ్రామ/వార్డు సచివాలయాల్లో స్పందన, గడప గడపకు మన ప్రభుత్వం అర్జీల పరిష్కారం ఇతర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై సీఎస్ జవహర్ రెడ్డి..కలెక్టర్లతో సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె శ్రీధర్ రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్‌వి వి సత్యనారాయణ, కాకినాడ కమిషనర్ కె రమేష్, సీపీవో పి త్రినాథ్, డ్వామా పీడీ ఎం వెంకట లక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, హౌసింగ్ పీడీ బి. సుధాకర్ పట్నాయక్, డీపీవో ఆర్ విక్టర్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్లు, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు

విశాలాంధ్ర -కొవ్వూరు :రెవిన్యూ డివిజన్ కేంద్రమైన కొవ్వూరు పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతు న్నాయి. ఈ విషయం తెలిసి కూడా టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. దీనికి ఉదాహరణగా ఇటీవల జరిగిన ప్రతి కౌన్సిల్ మీటింగులను ప్రతిపక్ష పార్టీతో పాటు అధికారపక్ష కౌన్సిలర్ కూడా అధికారుల తీరుపై మండిపడుతున్నారు. మరోవైపు హెూం మంత్రి తానేటి వనిత ఇటీవల కౌన్సిల్ మీటింగ్‌కు వచ్చి అధికారుల అవినీతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని వనిత హెచ్చరించినా ఫలితాలు మాత్రం కాన రావటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంగర సచివాలయం 2లో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంగర సచివాలయం-2లో అంగర పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ పిఎస్ఎస్ డి. రత్న కుమారి, డాక్టర్ జె అనూజ ప్రియాంక ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ వి. కోటేశ్వరరావు హాజరయ్యారు. డాక్టర్ రత్న కుమారి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతీ నెలా 3వ గురువారం అంగర సచివాలయం-2 వద్ద ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో గర్భిణీలను, బాలింతలను, శస్త్రచికిత్సలు జరిగి లేవలేని స్థితిలో ఉన్న వారిని వారి ఇంటి వద్దనే పరీక్షించి మందులు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 124 మందికి వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, సూపర్వైజర్స్ పి. సురేష్, టి. మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పి కె. రమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు వెంకటేశ్వర్లు, జివివి లక్ష్మి, దుర్గ సుమలత, 104 డిఇఒ ప్రసాద్, పైలట్ రాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'వికాస'లో 18న ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - కాకినాడ : 'వికాస' కార్యాలయంలో ఈనెల 18వ తేదీ శనివారం డబ్ల్యుఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్" కంపెనీలో నాన్ వాయిస్ (హెల్త్ కేర్) ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగానికి ఏదైనా డిగ్రీ ఉతీర్ణులైన 30 సం॥ల్లోపు స్త్రీ/పురుష అభ్యర్థులు అర్హులు. టైపింగ్ స్పీడ్ 30 డబ్ల్యుపిఎం ఉండాలి. వీరికి సంవత్సరానికి 1.8 లక్షల జీతం+ ఇన్సెంటివ్స్ ఉంటాయి. ఈ ఉద్యోగానికి ఎంపికైనవారు వైజాగ్‌లో పనిచేయాల్సి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈనెల 18వ తేదీ శనివారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ" వద్ద ఉదయం 9గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరుకావలెను. సెల్ నెం. 7799376444, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.వికాసజాబ్స్.కాం సంప్రదించాలి.

ఘనంగా నరహరిశెట్టి వెంకటరావు వర్థంతి

విశాలాంధ్ర - అంబాజీపేట : అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం అయినవిల్లిలో ఉన్న శ్రీ నరహరిశెట్టి వెంకట్రావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం కళాశాల ప్రధానదాత నరహరిశెట్టి వెంకటరావు 27వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా నరహరిశెట్టి వెంకటరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవరపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో 9 మంది అరెస్ట్



విశాలాంధ్ర - అన్నవరం : కాకినాడ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం. రవీంద్రబాబు ఆదేశాల మేరకు పత్తిపాడు సిఐ కిషోర్ బాబు ఆధ్వర్యంలో ఓ గంజాయి ముఠాను గురువారం తెల్లవారు జామున పట్టుకున్నారు. కాకినాడ అడిషనల్ ఎస్పీ పి. శ్రీనివాస్ సూచనల మేరకు పెద్దాపురం డిఎస్పి ఎస్ మురళీమోహన్ పర్యవేక్షణలో ముగ్గురు ఎస్సైలు సిబ్బంది పథకం ప్రకారం గంజాయి ముఠాపై మండపం సెంటర్ గోపాలపట్నం గ్రామాల్లో దాడి చేసి 32 కేజీల గంజాయి విలువ లక్ష 12 వేలు 10 డమ్మీ గంజాయి రంపపొట్లుతో కూడిన మూటలు స్వాధీనంతో పాటు రెండు మోటార్ సైకిల్, 6 సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకుని సీజ్ చేసినట్లు డిఎస్పి వివరించారు. అన్నవరం స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశంలో డిఎస్పి వివరాలను వివరిస్తూ మొత్తం ఈ కేసులో 11 మంది ముద్దాయిలు కాగా 9 మందిని చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలిపారు. రౌతులపూడి మండలం ఎస్ పైడిపాలెం గ్రామానికి చెందిన కాళ్ల శివ, జమీల్ రాజవొమ్మంగి మండలం ఒట్టిగడ్డ గ్రామం నాయుడులు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ సమావేశంలో ప్రత్తిపాడు, అన్నవరం, ఏలేశ్వరం ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో ఏప్రిల్ 3వ తేదీ నుండి జరగబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లకు అన్నిచర్యలు తీసుకోవాలని మండల అభివృద్ధి అధికారి నాతి బుజ్జి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మండలంలో పేరవరం, ర్యాలీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మరియు మహాత్మాగాంధీ ఎయిడెడ్ పాఠశాలలో ఎస్ఎస్‌సి పరీక్షలకు సెంటర్లుగా గుర్తించామన్నారు. సుమారు 634 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని ఆమె అన్నారు. అన్ని సెంటర్‌లలో అవసరమైన త్రాగునీరు, టాయిలెట్స్ పరిశుభ్రత, ఫర్నిచర్, తగినంత గాలి, వెలుతురు ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పివి ప్రసాదరావు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, వంశీకృష్ణ, జ్యోతిబసు, పరిమళ కుమారీ, జ్ఞానేశ్వరీ, సుబ్బలక్ష్మీ, మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు పొట్టి శ్రీరాములు

విశాలాంధ్ర - కాకినాడ : తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటులో ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములని, ఆయన త్యాగ నిరతికి తెలుగు ప్రజలు అంతా రుణపడి ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాకినాడ రామారావుపేట, సీబీఎం స్కూల్-ఫెలోషిప్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జాయింట్ కలెక్టరు ఎస్ ఇలక్కియ, జెడ్పీ సీఈవో ఎన్‌వి వి సత్యనారాయణ, కుడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె. రమేష్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో గాంధీజీ అడుగు జాడల్లో పయనిస్తూ భాషాప్రయుక్త రాష్ట్రాల కింద తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు చిన్న వయసులోనే ఆమరణ దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహెూన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములని అన్నారు. అంత గొప్ప మహనీయునికి ఘన నివాళులు అర్పించి స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. జాయింట్ కలెక్టరు ఎస్ ఇలక్కియ మాట్లాడుతూ నెల్లూరు ప్రాంతంలో జన్మించిన పొట్టి శ్రీరాములు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మా గాంధీజీతోపాటు అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. పొట్టి శ్రీరాములు లాంటి మరో పది మంది వ్యక్తులు ఉంటే భారతదేశానికి మరింత తొందరగా స్వతంత్రం సిద్ధించేదని గాంధీజీ పేర్కొన్నట్లు జేసీ తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి సత్య రమేష్, కాకినాడ ఆర్‌డీవో బీవీ రమణ, ఇతర అధికారులు, ప్రజా సంఘాల నేతలు తదితరులు హాజరయ్యారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

-ప్రశ్నించిన వారి ఇళ్లపై దాడులు

విశాలాంధ్ర - రావులపాలెం : అధికారం అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకుల ఆగడాలు రోజురోజుకీ పెరిగి పోతున్నాయని ఇళ్లపై దాడులకు దిగుతున్నారని కొత్తపేట నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. అధికారం అడ్డుపెట్టుకుని మట్టి మాఫియా చెలరేగి పోతోందని పేర్కొన్నారు. వారిని ప్రశ్నించినా, లేదా అడ్డు తగిలినా ఇంటి మీదకు వచ్చి దాడులకు దిగుతున్నారని దళితులను పావులుగా చేసి కులాల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి మాజీ సర్పంచ్ గుర్రాల నాగభూషణం ఇంటిపై జరిగిన దాడిని తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. వాస్తవ విషయాన్ని పరిగణలోకి తీసుకుని చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా అమలాపురం జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డికి తెలుగుదేశం పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టవలసిందిగా జిల్లా ఎస్పీని అభ్యర్థించారు. అసలు విషయానికొస్తే గ్రామాల్లో ఉన్న పట్టా భూముల్లో మట్టిని అక్రమంగా తరలిస్తుంటే కొమరాజులంక మాజీ సర్పంచ్, గ్రామస్తులు కలిసి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ద్వారా మట్టి మాఫియాకు అడ్డు తగులుకోవడంతో ఇళ్లపై దాడులకు దిగారు. భయభ్రాంతులకు గురిచేసి వారు పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. జరిగిన సంఘటనను ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులు బాధితులకు అండగా నిలిచారు. ఇటువంటి అనాగరిక చర్యలు మానుకోవాలని హితవు పలికారు. లేదంటే ప్రజా ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని తెలుగుదేశం పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, కంఠంశెట్టి శ్రీను, ధర్నాల రామకృష్ణ, బండారు సత్తిబాబు, ముత్యాల బాబ్జి, సయ్యపరాజు రామకృష్ణంరాజు, చిలువూరి సతీష్ రాజు, త్సామా బాబు,కాసా సాగర్, మాసాబత్తుల ఆనందరావు, గుబ్బల మూర్తి, పల్లి ఏసు, కాసురెడ్డి, యర్రంశెట్టి బుజ్జి, మిరపయల రాము, సిద్దిరెడ్డి శ్రీను, పెచ్చట్టి చిన్నారావు, దొమ్మేటి శ్రీను, సింహ, బద్ద ఏసు తదితరులు పాల్గొన్నారు.

మొదలైన వరి, మొక్కజొన్న, జొన్న కోతలు

-వర్షపు హెచ్చరికలతో ఆందోళనలో రైతులు

విశాలాంధ్ర - సీతానగరం : దాళ్వా వరి, మొక్కజొన్న, జొన్న కోతలు మొదలయ్యాయి. మండల వ్యాప్తంగా దాళ్వా సాగుగా సుమారు మొక్కజొన్న 5750, జొన్న 500, వరి 6500 ఎకరాలలో సాగు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వరి, మొక్కజొన్న, జొన్న కోతలకు వచ్చి రైతులకు పంట చేతికి వచ్చింది. కాటా 75 కేజీలు మొక్కజొన్న రూ.2050, జొన్న రూ.2350, వరి రూ.1600 చొప్పున దళారులు రైతుల వద్ద నుండి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ధర ఉంటే రైతులకు ఏ విధమైన నష్టం ఉండదు కానీ ధాన్యం కోతలు మొదలైనప్పుడు కాటా రూ. 1800 కొనుగోలు చేయగా ప్రస్తుతం రూ.1600కు వచ్చింది. మిగతా పంటల ధరలు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా వర్షపాతం ఉంటుందని హెచ్చరికలు జారీ చేసిన సంగతి అందరికీ తెలిసిందే. దీనితో చేతికి వచ్చిన పంట నీటి పాలు అవుతుందని రైతులు హుటాహుటిన వచ్చిన ధరకు విక్రయిస్తున్నారు. పంట వర్షపు నీటిలో తడవకుండా టార్పాను, బరకాలతో కప్పుతున్నారు. కొంత మంది రైతులు గతంలో రైతులకు సబ్సిడీ పైన టార్పాను, బరకాలతో ఇచ్చేవారని ఇప్పుడు ఇవ్వక పోవడం వల్ల చాలా మంది రైతుల వద్ద టార్పాను, బరకాలతో లేవని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు త్వరితగతిన స్పందించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను తెరిచే ఏర్పాట్లు చేయాలని, దానితో పాటు రైతులకు సబ్సిడీపై టార్పాను, బరకాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

ఆకతాయిల ఆటలు కట్టిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

విశాలాంధ్ర - కాకినాడ : చదువుకోవలసిన సమయంలో తల్లిదండ్రులను బెదిరించి, భయపెట్టి,అప్పులు చేయించి, అధిక వేగంతో వెళ్ళే మోటారు సైకిళ్ళు కొనిపించుకుని, రోడ్లపై రకరకాల విన్యాసాలు చేస్తూ, పాదచారులను, ప్రజలను భయభ్రాంతులు చేస్తున్న ఆకతాయిలను కాకినాడ ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకుని, వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కాకినాడ ట్రాఫిక్ డియస్పీ వెంకటేశ్వరరావు, సిఐ చైతన్య కృష్ణ గురువారం ట్రాఫిక్-2 పోలీసు స్టేషన్లో దీనికి సంబంధించిన సమాచారం విలేఖరులకు తెలియచేసారు. కాకినాడ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కొంతమంది తల్లిదండ్రులను బెదిరించి, భయపెట్టి అధిక వేగంతో వెళ్ళే మోటారు సైకిళ్ళు కొనిపించుకుని, వాటి ద్వారా నగరంలో ట్రాఫిక్ పోలీసులు కాపలా లేని ప్రదేశాలలో అధిక వేగంతో ప్రయాణిస్తూ ప్రజలను ఇబ్బందులు పెట్టడం వీరికి పరిపాటిగా మారిందని డియస్పీ తెలిపారు. ట్రాఫిక్ ఆఫ్ డేట్ పేరుతో 800 మంది వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకుని, ట్రాఫిక్ పోలీసుల కదలికలు ఎప్పటికప్పుడు పంచుకొంటూ, పోలీసుల కళ్ళు కప్పి ప్రయాణం చేయడం, పోలీసుల మీద అసభ్య పదజాలంతో దూషించడం వంటి మెసేజులు పెట్టడం వంటివి ఈ గ్రూపులు లక్ష్యంగా పెట్టుకున్నారని డియస్పీ తెలిపారు. ఇటువంటి గ్రూపులు ఎనిమిది ఏర్పాటు చేసుకుని, సుమారు ఐదు వేల మంది యువకులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి అధిక వేగంతో ప్రయాణం చేస్తున్న సంగతి తమ దృష్టికి వచ్చిందన్నారు. వీరిలో చాలామందికి డ్రైవింగ్ లైసెన్స్‌లు లేవని, పోలీసు కేసుల నుంచి తప్పించుకోవడానికి నెంబర్ ప్లేట్లు తొలగించడం, మైనర్లు డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు చేస్తున్నారని తెలిపారు. ఓ గ్రూపుకు సంబంధించిన కొంతమందిని అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రుల సమక్షంలో మొదటి తప్పుగా పరిగణించి, కౌన్సెలింగ్ ఇచ్చామని డియస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. కాకినాడ జిల్లా యస్పీ రవీంద్రనాథ్‌బాబు ఆదేశాలతో ప్రజలకు ట్రాఫిక్ వల్ల ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని డియస్పీ తెలిపారు.

పేరు గొప్ప...ఊరు దిబ్బ

ఇదీ రాష్ట్ర బడ్జెట్ తీరు

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : ఆర్థిక మంత్రి బుగ్గన రాష్ట్ర ప్రజలను తన మాటలతో బురిడీ కొట్టించారని పేరు గొప్ప వూరు దిబ్బ అన్న చందంగా ఈ బడ్జెట్ ఉందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత సంవ త్సరంలాగే ఈ బడ్జెట్ లో వాస్తవాలు లేవని అన్నారు. జగనన్న ఇళ్లకు నిధులు పెంచలేదన్నారు. రాజమండ్రి లో టూరిజం అభివృద్ధికి కృషి లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం పెరుగుతోందని, యువతకు భృతి కల్పించలేకపోయారని తెలిపారు. భవన నిర్మాణ రంగానికి నిధుల కేటాయింపులేదన్నారు.విశాఖ నుండి నెల్లూరు తడ వరకు సాగరమాల ప్రాజెక్ట్ నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. కోటిపల్లి రైల్వే నిధులు రాష్ట్ర వాటా చెల్లించకపోవడంవల్ల పనులు ఆగిపోయాయని మధు అన్నారు.

ఉగాదికి గృహాల ప్రారంభానికి సమగ్ర కార్యాచరణ

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి అనుగుణంగా, ఉగాది నాటికి గృహాలను ప్రారంభించడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత పేర్కొ న్నారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యస్ జవహర్ రెడ్డి విజయవాడ లోని సి ఎస్ క్యాంపు కార్యాల యం నుంచి రీ సర్వే పనులు, వేసవి దృష్ట్యా త్రాగునీరు వ్యవస్థ , జాతీయ రహదారులు, హౌసింగ్ లక్ష్యాలు, పంచాయతీ రాజ్, జగనన్న స్వచ్ఛ సంకల్ప, ఉపాధి హామీ, ప్రాధాన్యత భవనాలు, నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కె. మాధవీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, రానున్న వేసవి దృష్ట్యా ఎండలు తీవ్రత మండల స్థాయి లో సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి, వైద్య ఆరోగ్య సూచనలు మేరకు చర్యలు తీసుకోవాలని క్షేత్ర స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలో హౌసింగ్ కి సంబంధించి ఉగాది నాటికి పెండింగ్ ఇళ్ల నిర్మాణం కోసం మండల పరిధిలో లక్ష్యలను అనుసరించి ప్రతి రోజూ సమీక్ష చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 13309 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్స్ ఇచ్చామని తెలిపారు. జగనన్న భూ హక్కు, భూ రక్షా పథకం కింద రీ సర్వే ప్రక్రియలో అధికారిక గుర్తింపు, 2.0 వెర్షన్ ద్వారా నిర్ధారణ, రాళ్ళు ఏర్పాటు, డ్రోన్ సర్వే, గ్రౌండ్ ట్రూథింగ్, భూ హక్కు పట్టాల పంపిణీ పై జిల్లా ప్రగతిని వివరించారు. డీఆర్వో జి. నరశింహులు, ఆర్డీవో ఎ. చైత్రవర్షిణి, సీపీఓ కె.ప్రకాష్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ డి.బాలశంకర్ రావు, డీ పి వో పి. జగదాంబ, డ్వామా పీడీ జిఎస్ రామగోపాల్, ఎస్ ఈ పిఆర్ ఏబివి ప్రసాద్, డిఆర్డిఏ పీడి ఎస్. సుమలత, డి ఎల్ డిఓ లు పి. వీణాదేవి, వి.శాంతామణి, ఏడి సర్వే పి. లక్ష్మణరావు, హౌసింగ్ పీడీ జి. పరశురామ్, టిడ్కో ఈఈ పి. రీటా పలువురు జిల్లా శాఖా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మృతదేహంతో నిరసన

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన వెలుగుల భాను (21) గొల్లప్రోలు పట్టణంలోని ఓ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. భాను గత మార్చి 23న పురుగు మందు తాగి అస్వస్థతకు గురికాగా, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. తండ్రి సత్యనారాయణ చేసిన ఫిర్యాదుపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం భాను స్నేహితురాలు సత్య తండ్రి రావుల ఈశ్వరరావు ఫిబ్రవరి 23న ఫోన్ చేసి దుర్భాషలాడడంతో భాను తీవ్ర మనస్థాపం చెందిందని, కలుపు నివారణ మందులో ఎలుకల మందు కలుపుకొని తాగినట్లు ఫిర్యాదు చేశారన్నారు. గతంలో కళాశాల ప్రిన్సిపల్ సైతం భానును మందలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

మృతదేహంతో బైఠాయించి నిరసన : గొల్లప్రోలు పట్టణంలోని వెలుగుల భాను మృతదేహంతో ఆమె కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు పోలీసు స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు కేసు వివరాలు తారుమారు చేస్తున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, సుమారు రెండు గంటల పాటు రోడ్డు పై బైఠాయించారు. కాకినాడ డీఎస్పీ మురళీధర్ రెడ్డి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. బాధ్యులపై 306 కేసు నమోదు చేసామని తెలియజేయడంతో ఆందోళన విరమించారు. వెంటనే ఎస్ఐ రామలింగేశ్వరరావు, సిఐ శ్రీనివాసరావు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ప్రకటన

ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, రాజమండ్రి సెక్రటరీ గారు యిచ్చిన సంజాయిషీ ప్రకారం, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, అల్కాట్ గార్డెన్స్, పాలికవారి వీధి, డో.నెం. 2-20-21 రు కాపురస్తులు చిట్టిమేని లోవరాజు గారు రాజమండ్రి ఆర్యాపురం కో-ఆపరేటివ్ బ్యాంక్ నందు తనఖా లోను కోరుతూ రాజమండ్రి అల్కాట్ గార్డెన్స్ పాలికవారి వీధి, డో.నెం. 2-20-21/ఎ పై లోను కోరుతూ అప్లికేషన్ దాఖలు చేసియున్నారు. సదరు ఆస్తికి సంబంధించిన లింకు డాక్యుమెంట్స్ అయిన ది. 08-03-1978 తేదీన రిజిస్టర్ కాబడిన **ఒరిజినల్ దస్తావేజు నెం. 825/1978రు మరియు ఒరిజినల్ దస్తావేజు నెం. 2285/1964రు** గల దస్తావేజులు బొంతు అప్పారావు మరియు బొంతు ముత్యాలమ్మ అను వార్లు ఇల్లు మారే సమయంలో సదరు దస్తావేజులు పడిపోయినట్లుగా గుర్తించి సదరు దస్తావేజులు ది. 10-03-2021 సం॥ తేదీన పేపరు ప్రకటన యివ్వగా, సదరు దస్తావేజు దొరకనందున, సంబంధిత ఏరియా పోలీసు వారి వద్ద నుండి Not Traceble Certificate ను ది. 14-09-2021 పొందినట్లు బ్యాంక్‌కు దాఖలు చేసి, సదరు దస్తావేజులకు నకలు మాత్రం యిచ్చియున్నారు. కావున సదరు పైన తెల్పిన ఆస్తిపై ఎవరికైనసూ అభ్యంతరములు యున్న ఎడల గాని, సదరు ఒరిజినల్ దస్తావేజులు ఎవరి వద్ద నైన వున్న ఎడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలో సదరు పైన తెల్పిన బ్యాంక్ వారికి వ్రాతపూర్వకంగా తెలియపర్చవలెను. లేనియెడల సదరు దస్తావేజులు పడిపోయిన విషయం నిజమని భావించి సదరు చిట్టిమేని లోవరాజుకు లోను మంజూరు చేయ బడును. తదుపరి వచ్చు అభ్యంతరములు గాని, క్లయిములు గాని, బ్యాంక్ వారు యిచ్చు తనఖా లోనుపై బైండ్ కావని యిందుమూలముగా యావన్మందికి తెలియచేయడమైనది.

S.B.KUMAR, Advocate
Legal Advisor to Bank
Rajahmundry, Cell: 9347443588

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

పొట్టి శ్రీరాములుకు నివాళి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో అధికారులు, నగరపాలక సంస్థ సిబ్బంది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనరు పి.ఎమ్. సత్యవేణి, డిప్యూటీ కమిషనరు జి. సాంబశివ రావు, మేనేజర్ ఎమ్. డి. అబ్దుల్ మాలీక్ అస్ఫర్, మేనేజరు, రెవెన్యూ ఆఫీసర్ సిహెచ్. శ్రీనివాస రావు, డిప్యూటీ డైరెక్టర్ పి. రామ రావు, నగరపాలక సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కొరకు ఆర్టీసీ తిరగని రూట్లలో ఆటో సౌకర్యాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాలని జిల్లా కలెక్టరు డా.కె.మాధవీ లత పేర్కొన్నారు.స్థానిక జిల్లా కలెక్టరు క్యాంపు కార్యాలయంలో గురువారం రవాణా సౌకర్యం, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై పోలీసు, రవాణా, ఆర్టీసీ ఆటో యూనియన్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాధవీలత మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం, వచ్చే నెలలో నిర్వహించే పదవ తరగతి విద్యార్థుల పరీక్షలకు హాజరయ్యే సమయం వృధా కాకుండా పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరేందుకు,వాహనాలు సమకూర్చడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు కె. మాధవీలత పోలీస్, రవాణా, ఆర్టీసీ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఆయా పరీక్షా కేంద్రాలకు చేరే సమయం ఏమాత్రం వృథా కాకుండా ఉండేలా ట్రాఫిక్ నియంత్రణ, ఆయా రూట్‌లలో ఆటోలు, ఆర్టీసీ బస్సులు తిరిగేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఆటో యూనియన్, డ్రైవర్ల తరుపున పూర్తి సహకారం అందిస్తామని యూనియన్ నాయకులు కలెక్టరు కు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డి. టి. వో. కెఎస్ యంవి కృష్ణారావు, యంవిఐ సి హెచ్. సంపత్ కుమార్, ఎస్. ఎస్. రంగనాయకులు, ఆటో యూనియన్ చెందిన వాసం శెట్టి గంగాధర రావు, టి. లక్ష్మీ నరసింహారావు, యు. ఉమా మహేశ్వర రావు, ఎం. గణేష్, ఎన్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

బుగ్గన బడ్జెట్ మాయాజాలం

-ప్రజలను మోసం చేసిన జగన్ సర్కార్

-కోనసీమ రైల్వేకు మొండిచేయి

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన ప్రవేశపెట్టిన బడ్జెట్ గాలి బుడగలేనని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి జిఎంసీ హరీష్ బాలయోగి అన్నారు. జగన్ ప్రభుత్వం ప్రజలని మోసం చేసిందని దుయ్యబట్టారు. ప్రజలకు గాలి మేడలు కట్టినట్టు బడ్జెట్ వుంది తప్ప వాస్తవాలకు విరుద్ధంగా వుందని విమర్శించారు. అన్ని వర్గాల వారికి అన్యాయం జరిగే విధంగా బడ్జెట్ వుందని, అసెంబ్లీలో పిట్టకథల బడ్జెట్ చెప్తున్నారని ఎద్దేవా చేశారు. కోనసీమ ప్రజల చిరకాల వాంఛ కోటిపల్లి-నరసాపురం రైల్వే లైనుకు మొండిచేయి చూపించారని అన్నారు. కేంద్రం పూర్తి స్థాయి సహకారం అందించినా రాష్ట్ర వాటా నిధులు కేటాయించకపోవడం ప్రాజెక్టు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు.

బస్సు, ఆటో ఢీ : పలువురికి గాయాలు

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : రాజుపాలెం వద్ద బస్సును ఆటో ఢీ కొన్న ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. జగన్నాధపురం గ్రామానికి చెందిన గంధం గంగా కలవలపల్లి గంగ గోకవరం వస్తుండగా రాజుపాలెం గ్రామం వద్ద గోకవరం నుంచి అడ్డతీగల వెళుతున్న బస్సును ఆటో డ్రైవర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆటో డ్రైవర్ మూగవాడు. క్షతగాత్రులను ప్రభుత్వ వాహనమైన 108 లో గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఎవరికి ఎటువంటి ప్రాణహాని జరగలేదు. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఒక మహిళకు స్వల్ప గాయాలయ్యాయి.

ఉద్యోగాల పేరుతో మోసపోవద్దు

విశాలాంధ్ర - గోకవరం :నిరుద్యోగ యువత ఉద్యోగాల వేటలో కొంతమంది వ్యక్తులను నమ్మి మోసపోతున్నారని యువత అప్రమత్తంగా ఉండాలని గోకవరం ఎస్ఐ శివ నాగబాబు నిరుద్యోగ యువతకు తెలిపారు. ఇటీవల కాలంలో ఉద్యోగం పేరుతో మోసపోయిన సంఘటన గోకవరం గ్రామంలో చోటుచేసు కుంది. గోకవరం గ్రామానికి చెందిన గోర్త రాజు (23) అగ్రికల్చర్ పాలిటెక్నికల్ పూర్తి చేశాడు. జాబు లేకుండా ఖాళీగా ఉండడంతో అదే గ్రామానికి చెందిన తుపాకుల గణేష్ ను జాబు కోసం సంప్రదించాడు. తుపాకుల గణేష్ సలహా మేరకు వైజాగ్ కు చెందిన బుద్దా అవినాష్, బొక్కం హైమావతిని నమ్మి రాజు మోసపో యాడు. ఆంధ్రప్రదేశ్ సెక్రటేరి యేట్‌లో జాబ్ ఇప్పిస్తానని చెప్పగా వారికి గోర్త రాజు మరొక ముగ్గురు కలసి సుమారు ఆరు లక్షల రూపాయలు ఇవ్వగా వారికి జాబ్ ఇప్పించకుండా డబ్బులు తీసుకొని మోసం చేశారని ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన గోకవరం ఎస్సై శివ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా చింతా అనురాధ

విశాలాంధ్ర - అమలాపురం : కేంద్ర ప్రభుత్వం అమలాపురం పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం & ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా ఎంపిక చేసింది. ఈ మేరకు భారత ప్రభుత్వం నుండి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా ఎంపీ చింతా అనురాధ కేంద్ర ప్రభుత్వానికి, ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తాను ఇప్పటికే కేంద్ర కోకోనట్ బోర్డు మెంబర్‌గా, కేంద్ర పెట్రోలియం మరియు న్యాచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ స్టాండింగ్ కమిటీ మెంబర్ మరియు టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా సేవలు అందిస్తున్నట్లుగా ఎంపీ అనురాధ చెప్పారు. ఈ కొత్త పదవి ద్వారా వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీకి సంబంధించి ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేస్తానని ఎంపీ చింతా అనురాధ పేర్కొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అమరజీవి శ్రీపొట్టి శ్రీరాముల జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు జిల్లా అదనపు ఎస్‌పిఏవీ సుబ్బరాజు హాజరై, అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాలు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ గాంధీ భోదించిన సత్యం, అహింసా, హరిజనోద్ధరణకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడన్నారు. భార్య, బిడ్డ చనిపోవడంతో జీవిత సుఖాలపై విరక్తి చెంది, ఉద్యోగానికి రాజీనామా చేసి, గాంధీజీ మార్గదర్శకంలో పని చేసేందుకై సబర్మతి ఆశ్రమానికి చేరి, ఆశ్రమ బాధ్యతలు నిర్వహించి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, పలుమార్లు జైలుకు వెళ్ళిన స్వాతంత్ర్య పోరాటం చేసిన గాంధేయవాదన్నారు. మద్రాసు రాజధానిగా ఉన్న ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు వారి బాధలపైఉద్యమించి, భాషా ప్రయుక్త రాష్ట్రం కావాలని ఉద్యమించి, ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి, అమరులు అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్‌పి ఎం.సత్యనారాయణ, ఆర్ఐ శ్రీకాంత్, డిపిఓ ఎఓ రామ్మోహన్ , ఎస్‌బిఎస్ఐ శ్రీనివాస్, డిసిఆర్బీ సిఐ అహ్మద్ ఉన్నిసా, ఇతర పోలీసు అధికారులు, డిపిఓ కార్యాలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొని, అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలను సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు.

కొయ్యలగూడెంలో : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కుంతల గూడెం ప్రీ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాయపూడి వెంకటరమణ పేర్కొన్నారు. పాఠశాలలలోని విద్యార్థుల మధ్య పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన కృషి ఎనలేనిదని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. విజయ్, కె. అమృత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణాలను సైతం అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు నేటి తరానికి స్ఫూర్తి దాయకమని ఆర్య వైశ్య మహా సభ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు.స్థానిక బుట్టాయగూడెం రోడ్డులోని అమరజీవి పొట్టి శ్రీ రాములు విగ్రహం వద్ద 123 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చిన్ని రామ సత్యనారాయణ మాట్లాడుతూ రాజధాని లో శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు చేయాలన్నారు. పొట్టి శ్రీ రాములు జీవిత త్యాగ ఫలమే నేడు రాష్ట్ర ప్రజలు అనుభవిస్తున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ చిన్ని సాయికుమార్, వాసవి క్లబ్ సీనియర్ సభ్యులు గుడిమెట్ల యుగంధర్, ఏలూరు ఫణి కుమార్, వాసవి గోల్డ్ అధ్యక్షుడు సురేష్, సెక్రటరీ మణి తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుం దని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు మున్సిపల్ గరల్స్ హైస్కూలులో అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థినులకు ఆంధ్రరాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం ఎమ్.సుధారాణి, చెరుకువాడ రంగసాయి, అరసవిల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. డీఎన్నార్ కళాశాల లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శాంతకుమారి, అధ్యాపకులు గౌతం కుమార్, చెల్లబోయిన రంగారావు, సోమరాజు, సోమయ్య, మిలాంటన్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అమరజీవి జయంతి కార్యక్రమాన్ని హౌసింగ్ బోర్డు కాలనీ డెవలెప్ మెంట్ అసోసియేషన్, శ్రీపద్మావతి వెంకటేశ్వరస్వామి దేవస్థానం పాలక వర్గల సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కంతేటి వెంకట్రాజు, పెన్నాడ రామారావు, సూర్యనారా యణ రాజు, కుక్కల బాల, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మడిపల్లి చంద్రశేఖర్, జానపాటి మధుసూదనరావు, కడలి వెంకటేశ్వరరావులు, చెరుకువాడ రంగసాయి, ఫణి తదితరులు పాల్గొన్నారు. పట్టణ టిడిపి ఆదివారం బజార్ లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డ్వాక్రా అంగన్వాడి రాష్ట్ర ప్రధానకార్యదర్శి మెరగాని నారాయణమ్మ, రాష్ట్ర కార్యదర్శి వెంద్ర శ్రీనివాస్, నాయకులు ఎద్దు ఏసుపాదం, మైలాబత్తుల ఐసాక్ బాబు, మద్దుల రాము, గంటా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

టి నరసాపురంలో : టి నరసాపురంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమర జీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహిం చారు. ముందుగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు అన్నారు. పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండం సత్యనారాయణ మూర్తి, అద్దంకి రవి,మాదంశెట్టి సోమరాజు,అద్దంకి జగ్గా రావు, మండం ఆదిత్య కుమార్, కొనకళ్ళ మోహన్ కుమార్, మాదంశెట్టి మల్లికార్జున రావు,పురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో: స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీతో పాటు పాల్గొని స్వభాష రాష్ట్రం కోసం ఆత్మార్పణకు పూనుకున్న యోధుడు అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు అని శాఖ గ్రంథ పాలకురాలు రాముడు తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గ్రంథాలయం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర గురించి ఆయన చేసిన పోరాటాల గురించి రాముడు విద్యార్థులకు సూచించారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, చదువరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ

విశాలాంధ్ర -పోడూరు: విద్యార్థులు మహనీయులను స్ఫూర్తి గా తీసుకుని మంచి నడవడికతో తమ భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని శ్రీకనక దుర్గ,శ్రీ వాసవి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ బేతాళం సూర్యనారాయణ అన్నారు.పోడూరు శివారు కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో శ్రీకనక దుర్గ,శ్రీ వాసవి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి సేవా సంస్థ చైర్మన్ సూర్యనారాయణ, పాఠశాల హెచ్ఎం కేతా నాగరాజు,పిఎం సి చైర్మన్ చిట్టూరి నరసింహారావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల లోని 34 మంది విద్యార్థులకు సేవా సంస్థ తరపున భోజనం ప్లేట్లు అందజేశారు. అనంతరం సేవా సంస్థ చైర్మన్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు చేసిన పోరాటాన్ని త్యాగాన్ని విద్యార్దులకి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం కేతా నాగరాజు,పిఎంసి వైస్ చైర్మన్ కత్తుల సుధ,వాసా దుర్గారావు,వై.శ్రీను,ఎస్ కవిత,విప్పర్తి మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్ ప్రజా రంజక పాలన

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ముఖ్యమంత్రి జగన్ ఎస్ సి, ఎస్ టి, బీసీ మైనార్టీ వర్గాల బడుగు బలహీన వర్గాలకి మేలు చేస్తూ ప్రజా రంజక పాలన సాగిస్తున్నారని రాష్ట్ర సర్పంచ్ల ఛాంబర్ ఉపాధ్యక్షుడు ఏలేటిచిన తుక్కయ్య పేర్కొన్నారు. రాజవరం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద తుక్కయ్య ఆధ్వర్యంలో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా తుక్కయ్య మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడుతూ నా ప్రయాణం సామాన్యులతోనే, నా యుద్ధం పెత్తందారుల తోనూ, నా లక్ష్యం పేదరిక నిర్మూలన అని పలికిన మాటలు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల వారికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు గుదే వెంకటేశ్వరరావు, తమిర్చి పండు,ఉస్సే ఆంజనేయులు, దిద్దె ప్రసాద్, తమిర్చి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం రూరల్ : విధుల్లో భాగంగా నిరంతరం బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బందికి క్రీడలు నిర్వహించడం ద్వారా శారీరక , మానసిక ఉల్లాసం లభిస్తుందని ఏపీ నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.ఆర్.కె శాస్త్రి తెలిపారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో సంస్థలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ సౌజన్యంతో విద్యార్థులకు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి వారం రోజులపాటు నిర్వహించనున్న (పురుషులు, మహిళలకు వేర్వేరుగా) ఇంట్రామ్యురల్ డిపార్ట్మెంట్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. పురుషులకు క్రికెట్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, చదరంగం, అథ్లెటిక్స్, మహిళకు కబడ్డీ, త్రోబాల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చదరంగం, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉదయం గాని సాయంత్రంగాని వ్యాయామం, ధ్యానం, యోగా వంటి వాటికి కొంత సమయాన్ని వెచ్చిస్తే మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఈ స్నేహపూర్వక పోటీలు ఆచార్యులు, విద్యార్థుల మధ్య వారధిగా నిలుస్తాయని వివరించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబి వీరేష్ కుమార్ మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఏప్రిల్ 6న నిర్వహించే సంస్థ వార్షికోత్సవం కార్యక్రమంలో బహుమతులను అందజేస్తామని వివరించారు, అనంతరం శాస్త్రి చదరంగం ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డీన్ లు డాక్టర్ ఎస్.జయరామ్, డాక్టర్ టి.కురుమయ్య, సాస్ ఫ్యాకల్టీ ఇంచార్జి డాక్టర్ కిరణ్ తీపర్తి, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ సుదర్శన్ దువా, డాక్టర్ సంతోష్ , డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై జగన్ ప్రభుత్వం మరో బాదుడుకు సిద్ధం

విశాలాంధ్ర - ఏలూరు : ఇప్పటికే తుగ్లక్ నిర్ణయాల వల్ల సతమతమవు తున్న ప్రజలపై జగన్ సర్కార్ మరో బాదుడుకు సిద్ధమవుతోందని జనసేనపార్టీ ఏలూరు నియోజక ఇంఛార్జి రెడ్డి అప్పలనాయుడు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్ సర్కార్ ప్రజలపై పన్నుల మోత మోగించడమే లక్ష్యంగా పాలన సాగిస్తోందన్నారు. పట్టణాల్లో ప్రతి ఏటా ఆస్తి పన్ను 15 శాతం పెంచాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించుకుందని దీనిలో భాగంగానే ఏప్రిల్ నుంచి కొత్త పన్నుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ఆరోపించారు. ప్రజలను ఏమార్చి ఈసారి చెత్త పన్నును కూడా ఆస్తి పన్నులో కలిపేందుకు ప్రభుత్వం సిద్ధవుతోందన్నారు.ఇది ప్రజలపై మరింత భారం మోపడమేనని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004 నుంచి 2019 దాకా ఒక్క పైసా కూడా ఇంటి పన్ను పెరగ లేదని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఏపీలోని పట్టణాలు, నగరాలలో ఆస్తులున్నవారికి భారీగా పన్నులు వడ్డిస్తున్నారని, దీనికి తోడు అదనంగా చెత్తపన్ను వేసి నడ్డివిరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని రెడ్డి అప్పలనాయుడు డిమాండ్ చేశారు.

ఎస్ఆర్‌కెఆర్‌లో టెక్ ఫ్లీట్-2కే 23

విశాలాంధ్ర -భీమవరం: ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన " టెక్ ఫ్లీట్-2కే 23" పేరిట జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతి రాజు తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ ఇందుకు సంబంధించిన పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐటీ డిపార్ట్మెంట్ హెడ్, సింపోజిఎం కన్వీనర్ డాక్టర్ బిహెచ్.వి.ఎస్.రామకృష్ణంరాజు ఇందుకు సంబంధించిన వివరాలు అందిస్తూ విద్యార్థులకు 12 విభాగాల్లో వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సి ఎస్ ఐ విద్యార్థి విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. జాతీయస్థాయి విద్యార్థి సింపోజియంకు ఫ్యాకల్టీ కోఆర్డినేటర్స్‌గా ఐటీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఐ.హేమలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే.కిషోర్ రాజు వ్యవహరిస్తున్నారన్నారు. విద్యార్థి ప్రతినిధులుగా సి ఎస్ ఐ స్టూడెంట్ చాప్టర్ చైర్పర్సన్ ఎస్ జి ఎం ఏ అల్పన్, వాయిస్ చైర్ పర్సన్ జి భువన శ్రీ, కార్యదర్శి ఎం. భాను ప్రసన్న, జి చందన, కీర్తన, వేణుగోపాల్, వరుణ్ తేజ తదితరులు వ్యవహరిస్తున్నారన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ బాడీ మెంబర్ సాగి సత్యప్రతీక్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మల కుమారి

విశాలాంధ్ర - గణపవరం: ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి అన్నారు. గురువారం మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరపున జిల్లా పరిషత్ హై స్కూల్ (బాలురు) ఎకో క్లబ్(ఆవరణ క్లబ్)సంయుక్త ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్ధాలు గురించి అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంపై పర్యావరణ పరమైన విషయాలు విద్యార్థులు పాటించాలని దీని వలన ఆసక్తి వారికి కలుగు తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి మధురాజు, డాక్టర్ కె. స్వరూపరాణి, డాక్టర్ సిహెచ్ చైతన్య ,శ్రీనివాసరావు, ఎస్.కె పర్వాన్, సిహెచ్ అనురాధ, డివివి చిన సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

"సాంస్కృతిక కార్యక్రమాల పోటీలో బహుమతుల పంపిణీ

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య, నాటికల పోటీలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన పదిహేను మంది విద్యార్థులకు జే.కె.ఎలక్ట్రికల్ వారు హాట్ క్యారేజ్‌లు బహుమతులు గా ఇచ్చారు. విద్యార్థులు అందరికీ వాటర్ బాటిల్స్, శీతాల సత్యనారాయణ పౌచ్‌లు, బురిడి సరభయ్య, పెన్సిల్ బాక్సుల కిట్టు అందజేసారు. వార్షికోత్సవం జరపడానికి దాతలు పంచాయతీ బోర్డు సభ్యులు, పొలమూరి సతీష్, షేక్ మస్తాన్ వలీ, కాళ్ళ రాము, పల్లిశ్రీను, పండు, వంబరిల్లి దుర్గారావు, రామకృష్ణ, దువ్వారపు శ్రీను, షేక్ మస్తాన్, గొట్టాపు వెంకటేష్ గ్రామస్తులు సహకరించారని ప్రధానోపాధ్యాయులు అల్లు శ్రీను తెలియజేసారు.

అంకెల గారడీగా బడ్జెట్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : గురువారం ఏపీ శాసనసభలో ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాద్ రెడ్డి ప్రవేశ పెట్టిన 2023-24 వార్షిక బడ్జెట్ తప్పుల తడక, అంకెల గారడిగా ఉందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు విమర్శించారు.జంగారెడ్డిగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ రూ.2 లక్షల 79వేల 279 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెడితే దానిలో అన్ని మాయామంత్రాల మాదిరిగా చిత్ర విచిత్రాలతో విన్యాసాలు చేస్తూ అంకెల గారడీలు చేసారని, బీసీల సంక్షేమం కోసం రూ.38,605 కోట్ల కేటాయింపులు చేసినట్టు అంకెలు గాంభీరంగా ఉన్నాయి కానీ ఈ నాలుగేళ్లలో ఒక్క రూపాయి అయినా బీసీల సంక్షేమం కోసం ఖర్చు చేసారా అని ప్రశ్నించారు.59 కార్పొరేషన్స్ పెట్టారనీ వాటి ద్వారా ఒక రూపాయి అయినా ఖర్చు చేసారా, రాయితీలపై ఒక కార్పొరేషన లోన్ అయినా ఇచ్చారా అంటూ ప్రశ్నించారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

విశాలాంధ్ర - ఆలమూరు : చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములని ఆలమూరు ఎంపీడీవో కే జాన్ లింకన్ అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో పొట్టి శ్రీరాములు 122వ జయంతి వేడుకలు మండల ప్రజా పరిషత్ కార్యాలయం సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవి యైన మహాపురుషుడని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ పరిపాలన అధికారి (ఏవో) వి. రామ స్వరూప్, పలువురు పంచాయతీ కార్యదర్శులు ప్రజాపరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

గండేపల్లిలో: గండేపల్లి మండలం తాళ్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వరరావు (జివిఆర్) ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 122వ జయంతి నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న మద్రాస్ నగరంలో జన్మించారని, ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన మహా పురుషుడని కొనియాడారు. సోషల్ మాస్టర్ మహేష్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు లాంటివాళ్ళు పదిమంది ఉంటే దేశానికి ఒక్క సంవత్సరంలోనే స్వాతంత్ర్యం తెచ్చేవారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహిని, శ్రీవాణి, దీనరత్నం, రమాదేవి, ఎ. సత్యనారాయణ (ఏఎస్ఎన్), రాంబాబు, మహేష్, పిఈటి సత్యనారాయణ, శ్రీనివాసు, తెలుగు శ్రీనివాసు, శాంతి కుమారి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో: ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ హాలులో కమిషనర్ జి.లోవరాజు అధ్యక్షతన పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ కమిడిప్రవీణ్ కుమార్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రెడ్డి హేమ సుందరి శివన్నారాయణ, 17వ వార్డు కౌన్సిలర్ బొంతు సత్య శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది ఔట్‌సోర్సింగ్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో : తెలుగు భాష ఉన్నంత కాలం అమరజీవి పొట్టి శ్రీరాములు బ్రతికే ఉంటారని నిడదవోలు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. నిడదవోలు మెయిన్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనమైన నివాళిలర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 58 రోజులు నిరాహార దీక్ష చేసి భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడడానికి కారకుడు శ్రీ పొట్టి శ్రీరాములు అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ. మాజీ కౌన్సిలర్ కేదారిశెట్టి సునీత, కేదారిశెట్టి రవికుమార్, తెలుగు యువత నాయకులు సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు ఎమ్మెల్యే కార్యాలయంలో : భాషాప్రయుక్త రాష్ట్రల కోసం పోరాడి తుది శ్వాస విడిసిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు అని నిడదవోలు పట్టణ మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఆంధ్ర జాతి ఐక్యత కోసం పోరాడిన మహనీయులు పొట్టి శ్రీరాములు అన్నారు.పట్టణ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

అమలాపురంలో : అమరజీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బిజెపి మెడికల్ సెల్ కన్వీనర్ కాళ్లకూరి గోపికృష్ణ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువరానిదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పొట్టి శ్రీరాములు రాష్ట్రంగా నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోనసీమ జిల్లాను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా చేసినట్లుగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కూడా అమరజీవి పొట్టి శ్రీరాములు రాష్ట్రంగా పేరు మార్చాలని ఈ సందర్భంగా గోపి కోరారు.

ఆత్రేయపురంలో : మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 122వ జయంతి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాతి బుజ్జి మాట్లాడుతూ పొట్టీ శ్రీరాములు చిరస్మరణీయుడని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవియైన మహాపురుషుడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇఓ (పిఆర్ & ఆర్‌డి) డి శ్రీనివాస్, పరిపాలనాధికారి, టివి సురేంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, కె కృష్ణ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్ ఇండియా సౌత్ జోన్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో ఆదిత్య పాలిటెక్నిక్ విద్యార్థి జయకేతనం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెంలో గల ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో ఈసిఇ విభాగంలో మొదటి సంవత్సరం చదువుతున్న కే సాంబశివరావు ఈ నెల 11 మరియు 12 తారీఖులలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఆల్ ఇండియా సౌత్ జోన్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2022-23లో సార్ట్ పుట్ విభాగంలో గోల్డ్ మెడల్ మరియు డిస్కస్ త్రో విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారని ఆదిత్య కళాశాలల వైస్ చైర్మన్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా ముందు ఉండేటట్టు ప్రోత్సహించడం జరుగుతుంది అని అందువల్లే ఈ విజయం సాధ్యపడింది అని తెలియజేసారు. ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్ ఎస్‌టి విఎస్ కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయి మరియు రాష్ట్ర స్థాయిలో జరిగిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో వివిధ విభాగాలలో తమ విద్యార్థులు మొదటి మరియు ద్వితీయ స్థానాలలో నిలిచారని తెలియజేస్తూ ఈ విజయానికి కారకులైన పైజికల్ డైరక్టర్లు కె. రాజు, సిహెచ్ కిరణ్ కుమార్‌లను అభినందించారు. ఈ సమావేశంలో పాలిటెక్నిక్ డీన్ ఎవి మాధవరావు, హెచ్ & బిఎస్ విభాధిపతులు కె ధర్మారావు, ఎన్. మల్లేశ్వరరావు పాల్గొని విజేతను అభినందించారు.

కొట్లాట కేసులో ఇద్దరిపై కేసు నమోదు

విశాలాంధ్ర - రావులపాలెం : మండల పరిధిలోని కోమరాజులంక గ్రామ లంక భూముల్లో ఎటువంటి అనుమతిలేకుండా అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడినందుకు, ఇద్దరు వ్యక్తులు తమ ఇంటిపై దాడి చేసి కొట్టినందుకు పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు. రావులపాలెం ఎస్సై ఎం. వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం ఎటువంటి అనుమతులు లేకుండా లంక భూముల్లో మట్టితవ్వుతుండగా గుర్రాల పుల్లేశ్వర రావు, గుర్రాల సత్యనారాయణలు అక్రమ మట్టి తరలింపును ప్రశ్నించినందుకు మంగళవారం రాత్రి సుమారు 9.00 గం.కు అదే గ్రామానికి చెందిన యార్లగడ్డ గణేశ్, యార్లగడ్డ సత్తిపండు, కొంతమంది కలిసి తమ ఇంటికి వచ్చి దాడి చేసి కొట్టినట్లు వారు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటరమణ తెలిపారు.

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేషన్ అందజేత

విశాలాంధ్ర-ఉంగుటూరు : పొట్టి శ్రీరాములు పరిరక్షణ సమితి ఏలూరు జిల్లా తరపున కోనా శ్రీనివాస్ సొంత నిధులు రూ.60వేల వ్యయంతో ఒక ఆక్సిజన్ కాన్సంట్రేషన్‌ను ఉంగుటూరు సర్పంచి బందారు సింధు మధు బాబుకు గురువారం అందజేశారు. పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆ గ్రామానికి కోనా శ్రీనివాసరావు, హనుమాన్ బాబులు ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా దాత కోనా సోదరులను ఉంగుటూరు గ్రామపంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి కె.వి గిరిధర్, ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

మహిళల జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికలు

విశాలాంధ్ర-భీమవరం: హర్యానాలో ఈ నెల 23 నుంచి 26 వరకు జరగబోయే 69వ జాతీయ స్థాయి సీనియర్ మహిళ ఆంధ్ర కబడ్డీ జట్టుకు ఈ నెల 19వ తేదీ ఆదివారం ఉదయం గం 9 నుండి ఉమ్మడి గుంటూరు జిల్లా బి.ఆర్. స్టేడియం లో జరుగుతాయని పశ్చిమగోదావరి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, చీఫ్ కోచ్ పి.సురేంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోటీలలో పాల్గొను క్రీడాకారిణులు 75 కిలోల లోపు బరువు ఉండాలి, ఆసక్తి కలిగిన క్రీడాకారిణులు పాల్గొనవచ్చన్నారు.

రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం

విశాలాంధ్ర - ముమ్మిడివరం, ఐ పోలవరం : నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో వచ్చింది. గడిచిన 195 రోజులకు గాను రూ.26,92,302 (26 లక్షల 92 వేల మూడువందల రెండు) రూపాయలు హుండీల ద్వారా ఆలయానికి ఆదాయం సమకూరినట్లు చైర్మన్ పెన్మత్స వాసురాజు, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం దేవాదాయశాఖ తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. గ్రా.190 వెండి, బంగారం గ్రా.22.500 మిల్లిగ్రాములు, 3 విదేశీ నోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈమొత్తాన్ని స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్‌లో జమ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చక, పురోహిత వైదిక, కార్యాలయం సిబ్బందితో పాటు మురమళ్ల సర్పంచ్ కాలే రాజబాబు, లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ కొలిశెట్టి గంగబాబు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పులు

విశాలాంధ్ర - లింగపాలెం : వాతావంణంలో మార్పు రావటంతో మెట్ట ప్రాంతపు రైతులు ఆందోళన చెందుతున్నారు. లింగ పాలెం మండలంలోని పలు ప్రాంతాలలో గురువారం చిరు జల్లులు పడ్డాయి. తుపాను ప్రభావం ఉంటుందనే హెచ్చరి కలు రావటంతో ఎండుమిర్చి, నాటు పొగాకు, మొక్కజొన్న పండించిన రైతులు తుఫాను ప్రభావం వల్ల ఎటువంటి పరిస్థితులు తలెత్తుతాయోననే ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ఆరుబయట ఉన్న పంటలను భద్రపరచుకోవటంలో రైతులు నిమగ్నమయ్యారు.

అంకెల గారడీ బడ్జెట్

విశాలాంధ్ర -నూజివీడు :మంత్రి బుగ్గన అంకెల గారడి బడ్జెట్ను ప్రవేశపెట్టారని నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. బడ్జెట్లో రెవెన్యూ లోటు 22316 కోట్లు పేర్కొన్న బుగ్గన ప్రతి సంవత్సరం లక్షల కోట్ల రూపాయలు రుణాలు ఎందుకు చేస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. ఎప్పుడు పేలుతుందో తెలియని రాష్ట్ర ఆర్థిక స్థితిపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయానికి బడ్జెట్లో చూపిన అంకెలకు వాస్తవ ఖర్చుకు పొంతన లేదన్నారు. ప్రతి సంవత్సరం పన్నుల పెంపులో ఆంధ్రప్రదేశ్ రికార్డులు సాధిస్తుందని టిడిపి హయంలో ఎటువంటి పన్నులు పెంచకుండా మెరుగైన పాలన అందిస్తే రాష్ట్ర ప్రజలపై మోపలేని భారాన్ని మోపుతున్న జగన్ రెడ్డి ప్రభుత్వం మరోవైపు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేస్తూ మీటర్ నొక్కి ఏ ఖాతాలకు జమ చేస్తుందో అర్థం కాని పరిస్థితి ఉందని ఆయన విమర్శించారు.

నూకాంబిక అమ్మవారి జాతరకు గట్టి బందోబస్తు

విశాలాంధ్ర - ఆలమూరు : ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఆరాధ్య దైవమైన కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం చింతలూరు శ్రీ నూకాంబిక అమ్మవారి జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ తెలిపారు. గురువారం ఆయన రావులపాలెం సిఐ రజనీ కుమార్, ఆలమూరు ఎస్సై శివప్రసాద్‌తో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావులపాలెం సిఐ రజని కుమార్ పరివేక్షణలో రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, ఆలమూరు ఎస్సైతో పాటు మరో 150 మంది జిల్లాకు చెందిన పోలీసులు, హోంగార్డులు బందోబస్తు నిర్వహించనున్నారనారు. రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసామన్నారు. 20వ తేదీ జాతర, 21వ తేదీన తీర్థం, 22వ తేదీన ఉగాది సందర్భంగా బద్ది కడుగుట నిర్వహిస్తారని, ఏప్రిల్ వరకు నెల రోజులు పాటు జరిగే ఈ జాతరకు రెండు లక్షల పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమికఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని సచివాలయాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలులో ప్రాథమిక పాఠశాలలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో వీక్లీ ఐరన్ ఫోలిక్ సప్లమెంటరీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆరోగ్య కార్యకర్తలు మీడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ ఆశ కార్యకర్తలు అంగన్ వాడి కర్తలు ఐరన్ మాత్రలు పిల్లలకు వేసినట్లు పీహెచ్ సి వైద్యాధికారులు డాక్టర్ పులపర్తి సంతోష్ నాయుడు డాక్టర్ పి.కిరణ్మయిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జే విల్సన్ బాబు, హై స్కూల్ హెచ్ఎం లు కె. రాంబాబు, అంబటి అనురాధ, ఆరోగ్య సహాయకులు ఎం ఎస్ యోహాన్, ఎ. కృష్ణ ,జి. శ్రీను, కె మార్తమ్మ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.